## మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే



బైక్‌పై నుంచి పడిన శ్రీనివాస్‌కు నీళ్లు తాగిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట,మే13: బైకుపై నుంచి రోడ్డుపై పడిన వ్యక్తిని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి దవాఖానకు తరలించి మానవత్వం చాటుకున్నారు. దుబ్బాక నియోజక వర్గ పర్యటన ముగించుకొని మంగళవారం సాయంత్రం హైదరాబాద్ వెళ్తున్న సమయంలో చేగుంట మండలం బోనాల కొండాపూర్ స్టేజ్ వద్ద గోవిందాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్‌కు ఫిట్స్ వచ్చి బైక్‌పై నుంచి కింద పడ్డాడు. ఇది గమనించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి వెంటనే కారు దిగి శ్రీనివాస్‌ను ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులతో ఫోన్‌లో మాట్లాడారు.

## మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం



మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న గిరిజనులు



కంఠారెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేస్తున్న తండావాసులు

రామాయంపేట, మే 13 : రామాయంపేట మండలం కిషన్ తండాలో జగదాంబికా, సేవాలాల్ మహరాజ్ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలకు ఆహ్వాన పత్రికను అందజేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, మెదక్ నియోజక వర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డికి కిషన్ తండావాసులు తరలివెళ్లి ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు జరిగే ప్రతిష్ఠామహోత్సవాలకు రావల్సిందిగా కోరారు. రెండు రోజుల పాటు జరిగు ఉత్సవాలకు తండావాసులతో పాటు ఇతర గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు.

## తూకంలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

### కలెక్టర్ రాహుల్‌రాజ్



చిన్నశంకరంపేట కొనుగోలు కేంద్రంలో తూకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

చిన్నశంకరంపేట, మే13 : కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీసుకొచ్చిన ధాన్యం తూకంలో అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని కలెక్టర్ రాహుల్‌రాజ్ హెచ్చరించారు. మంగళవారం చిన్నశంకరంపేట మండలంలోని ఎస్.కొండాపూర్, కొర్విపల్లి, గవ్వలపల్లి, మడూర్, శాలిపేట గ్రామాల్లో సొసైటీ, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా 400 వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని, నేటి వరకు 3,50,000 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు అయ్యిందన్నారు. ధాన్యం విలువ చేసేందుకు 70 గౌడౌన్లను ఏర్పాటు చేశాం. ప్రతి రైస్ మిల్లులో రెవెన్యూకు సంబంధించి సిబ్బందిని నియమించి రైతుల వాడిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న ట్లు తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు సహకరించాలని ఆదేశించారు. ధాన్యాన్ని జూన్ నెల వరకు కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. రైతులు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుడదన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ మన్నన్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

**చిన్నశంకరంపేటలో..**

చిన్నశంకరంపేట,మే 13 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవొద్దని మెదక్ ఆర్డీవో రమాదేవి సూచించారు. మంగళవారం చిన్నశంకరంపేటలో ఆమె ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. తహసీల్దార్ మన్నన్ మండలంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు.

## ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలి

పెద్దశంకరంపేట, మే 13 : మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పథకం పనులను ప్రత ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఈజీఎస్ ఏపీవో సంతోష్ కుమార్ తెలిపారు. మంగళవారం మండలపరిధిలోని కట్టెల వెంకటాపురంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో నర్సరీలను పరిశీలించారు. నర్సరీలకు నీటి ఎద్దడి తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## రైస్ మిల్లు యజమానుల అరెస్టు

కొమురవెల్లి, మే13: ధాన్యం అవకతవకలు జరిగిన కేసులో ముగ్గురు రైస్ మిల్లు యజమానులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చేర్యాల సీఐ శ్రీను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొమురవెల్లి మండలం కిష్టంపేటకు చెందిన శ్రీనివాస్ రైస్ మిల్లుకు సివిల్ సప్లయ్ అధికారులు 2022-23, 2023-24 సంవత్సరాలకు సీఎంఆర్ గురించి అప్పగించిన ధాన్యం మిల్లింగ్‌లో అవకతవకలు జరిగాయని సంబంధిత శాఖ అధికారుల పరిశీలనలో గుర్తించారు. రూ. 4,57,93,542 విలువైన 18,513 క్వింటాళ్ల ధాన్యం మిల్లింగ్‌లో అక్రమాలు జరిగాయని, వారిపై చర్యలు తీసుకోవాలని జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ బి. ప్రవీణ్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దీనికి బాధ్యులైన రైసు మిల్లు యజమానులు ప్రతాప్, శ్రీనివాస్, ఆకుల కృష్ణను అరెస్టు చేసి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

## వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



చల్మెడలో బోనం ఎత్తుకున్న బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి

నిజాంపేట,మే13 : మండలంలోని చల్మెడలో మహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం మున్నూరు కాపు సంఘం సభ్యులు మండప దేవత పూజలు, యజ్ఞం నిర్వహించారు. సాయంత్రం వేళ నిర్వహించిన పోచమ్మ బోనాల ఊరేగింపు కార్యక్రమానికి బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి హాజరై బోనమెత్తారు.

**పరామర్శ..**

నిజాంపేటకు చెందిన ఉద్యమకారుడు, బీఆర్ఎస్ యువ నాయకుడు ముస్తఫా అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. బీఆర్ఎస్ నాయకుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. మృతుడి కూతురు పేరిట రూ.25 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని హామీ ఇచ్చారు. సంఘం సభ్యులు, నేతలు ఉన్నారు.

## ఆధార్ సేవలు పున: ప్రారంభం

తూప్రాన్, మే 13 : తూప్రాన్ పట్టణంలోని సబ్ పోస్టాఫీస్‌లో ఆధార్ సేవలు కొన్ని రోజులుగా నిలిచిపోయిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ఆధార్ సేవలు పున: ప్రారంభిస్తున్నట్లు సబ్ పోస్టుమాస్టర్ కనకరాజు మంగళవారం ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ, పరిసర ప్రాంత ప్రజలు సేవలు వినియోగించుకోవాలని సూచించారు.

# డిగ్రీ ప్రవేశాలకు 'దోస్త్'

- మూడు విడతల్లో 'దోస్త్' ప్రవేశాల ప్రక్రియ
- మెదక్ జిల్లాలో 4 కళాశాలల్లో 1860 సీట్లు అందుబాటులో..
- జూన్ 28తో ప్రవేశాల పూర్తి.. 30 నుంచి తరగతులు ప్రారంభం




మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల

మెదక్ మున్సిపాలిటీ, మే 13 : డిగ్రీ కోర్సుల్లో చేరాలంటే 'దోస్త్' కట్టాల్సిందే. డిగ్రీ కళాశాలల్లో అడ్మిషన్లలో పారదర్శకతకు 2016 అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా 'డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ'(దోస్త్)ను రాష్ట్ర ఉన్నత విద్యామండలి అందుబాటులోకి తెచ్చింది. దీనికి సంబంధించి 2025-26 సంవత్సరానికి నోటిఫికేషన్ జారీ చేయగా తొలి విడుత అడ్మిషన్లు ఈనెల 21 వరకు అన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశం కల్పించారు. మూడు విడుతల్లో జరిగే అడ్మిషన్ల ప్రక్రియ జూన్ 28తో ముగియనున్నది. 30 నుంచి తొలి తరగతులు ప్రారంభమవుతాయి. విద్యార్థులు 'దోస్త్' వెబ్‌సైట్‌తో పాటు 'దోస్త్' మొబైల్ యాప్‌తో సైతం ఆన్‌లైన్ అడ్మిషన్లు చేసుకునే అవకాశం ఉంది. మెదక్ జిల్లాలో 4 ప్రభుత్వ కళాశాలలు ఉండగా, బీఏ, బీకాం, బీఎస్సీ గ్రూపుల్లో 1860 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో మెదక్ డిగ్రీ కళాశాలలో 1020, నర్సాపూర్ డిగ్రీ కళాశాలలో 360, రామాయంపేట, కొడిపల్లి డిగ్రీ కళాశాలల్లో 240 చొప్పున సీట్లు ఉన్నాయి.

**రిజిస్ట్రేషన్ ఇలా..**

'దోస్త్'లో విద్యార్థులు తమ ఆధార్ కార్డుకు ఫోన్ నంబర్ లింక్ చేసుకొని http://dost.cgg.gov.in వెబ్‌సైట్‌లో గానీ 'దోస్త్' మొబైల్ యాప్‌లో గానీ లాగిన్ కాగానే దోస్త్ ఐడీ, పిన్ నంబర్ వస్తుంది. వీటిని ఉపయోగించి దరఖాస్తు ప్రక్రియ పూర్తి చేసుకోవాలి. ఓపెన్ అయిన సైట్‌లో యూనివర్సిటీ, కళాశాలలు, కళాశాలల వారీగా ప్రాధాన్యత క్రమంలో కోర్సుల ఎంపిక, వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవాలి, కోరుకున్న కళాశాలలో సీటు వస్తే సెల్ఫ్ రిపోర్టింగ్ ద్వారా కన్ఫర్మేషన్ చేసుకోవాలి. ఏ దశ కౌన్సెలింగ్‌లో అయినా సెల్ఫ్ రిపోర్టింగ్ ఎంచుకున్న కళాశాలలకు వెళ్లి అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలు చూపించి ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

**ముఖ్యమైన ప్రక్రియ**

- డిగ్రీ ఆన్‌లైన్లకు ఫేజ్-1లో ఈనెల 21 వరకు ఆన్‌లైన్‌లో రూ.200 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- ఈనెల 22 వరకు కళాశాలల ఎంపికకు వెబ్ఆప్షన్స్ ఇచ్చుకునే అవకాశం ఉంది.
- ఈనెల 29న వెబ్-ఆప్షన్ ఇచ్చిన విద్యార్థులకు తొలి విడుత సీటు అలాట్‌మెంట్ చేస్తారు.
- అడ్మిషన్ పొందిన విద్యార్థులు ఈనెల 30వ తేదీ నుంచి జూన్ 6 వరకు ఆయా కళాశాలలలో (ఫీజు, సీటు రిజర్వేషన్ ఫీజు చెల్లించి) చేరడానికి ఆన్‌లైన్ సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి.
- రెండో విడుత ఈ నెల 30 నుంచి జూన్ 8వ తేదీ వరకు రూ. 400 చెల్లించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్స్ నమోదు చేసుకోవాలి.
- మూడో విడుత అడ్మిషన్లకు జూన్ 13 నుంచి 19 తేదీ వరకు రూ. 400 చెల్లించి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, వెబ్ ఆప్షన్స్‌కు అవకాశమిస్తారు.
- జూన్ 30 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

### హెల్ప్ సెంటర్‌ను సంప్రదించాలి



మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మెదక్ జిల్లాస్థాయిలో దోస్త్ డిస్ట్రిక్ట్ హెల్ప్ లైన్ సెంటర్‌గా గుర్తించబడిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ తెలిపారు. దోస్త్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ విద్యార్థులకు ఏమైనా సాంకేతిక సమస్యలు ఎదురైతే కళాశాల పని సమయాల్లో లేదా హెల్ప్‌లైన్ సెంటర్‌ను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకో కళాశాల 'దోస్త్' కో-ఆర్డినేటర్ సురేందర్‌రావు(7901396797), టెక్నికల్ అసిస్టెంట్లు, కాశీవిశ్వనాథ్ (8121548345) మానయ్య (9032983233) నంబర్లను సంప్రదించాలని సూచించారు.

**- డాక్టర్ హుస్సేన్, కళాశాల ప్రిన్సిపాల్**

## భూ భారతితో 'భూ' సమస్యల పరిష్కారం



జగ్గంపేటలో దరఖాస్తులను సేకరిస్తున్న రెవెన్యూ అధికారులు

చిలిపిచెడ్, మే 13 : రాష్ట్ర వ్యాప్తంగా భూ భారతి చట్టం అమలులో భాగంగా భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు చిలిపిచెడ్ తహసీల్దార్ సమదేమ్ అన్నారు. మంగళవారం మండలంలోని జగ్గంపేట, మంగళిపల్లి గ్రామల్లో కొనసాగుతున్న భూ సమస్యలపై రైతులు అందజేసిన దరఖాస్తులను తహసీల్దార్ పరిశీలించారు. అనంత రం ఆయన మాట్లాడుతూ రైతు లు భూ సమస్యలపై తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు వెళ్లాల్సివచ్చేదని, కానీ ఇప్పుడు అధికారులు స్వయంగా గ్రామాలకే వచ్చి ప్రజల సమస్యలను స్వీకరిస్తున్నారని తెలిపారు. ఈ సదస్సు ద్వారా రెవెన్యూ అధికారులకు క్షేత్రస్థాయిలో ఎవరెవరికి ఎలాంటి భూ సమస్యలు ఉన్నాయో అవగాహన వస్తుందన్నారు. ఈ రెవెన్యూ సదస్సులో రైతు ల దగ్గర నుంచి పూర్తిగా స్వీకరించబడతాయని, రైతు లు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల నుంచి వచ్చిన తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రంలో ధాన్యం పరిశీలన



చండూర్‌లో కొనుగోలు కేంద్రంలోని ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఈవో కృష్ణవేణి

చిలిపిచెడ్, మే 13 : మండల పరిధిలోని చండూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయ విస్తరణ అధికారి కృష్ణవేణి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యంలో తేమశాతం పరిశీలించి, కొనుగోలు చేయాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ప్రతి రోజు ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు కలిగించవద్దన్నారు. ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కొనాలి



నర్సాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న రైతు రక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్య యాదవ్

నర్సాపూర్,మే 13 : వర్షానికి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి జిల్లా గౌరవ అధ్యక్షుడు మైసయ్య యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం నర్సాపూర్ పట్టణంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. హమాలీల కొరతతో మూడు లారీల ధాన్యం బస్తాలు నిలిచిపోయాయని వెంటనే ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. లారీలు, హమాలీలు సరిగ్గా ఉన్నట్లయితే జిల్లాలోని మొత్తం కేంద్రాల్లో ధాన్యం తరలింపు పూర్తవుతుందని వెల్లడించారు. రైతు రక్షణ సమితి జిల్లా ముఖ్య సలహాదారుడు చంద్రశేఖర్, రైతులు పాల్గొన్నారు.

## చిన్నారుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు



నిజాంపేట: చిన్నారుల బరువును పరిశీలిస్తున్న శిశు సంక్షేమ అధికారి హైమావతి

శివ్వంపేట, మే 13 : చిన్నారుల ఆరోగ్యంపై అంగన్‌వాడీ టీచర్లు నిర్లక్ష్యం వహించవద్దని సీడీపీవో హేమభార్గవి అన్నారు. మంగళవారం మండలంలోని రత్నాపూర్, పిల్లుట్ల, లింగోజీగూడతండాలను సీడీపీవో సందర్శించి అక్కడ ఉన్న అతితీవ్ర లోపపోషణ పిల్లలను ఎత్తు, బరువులను స్వయంగా చూసి తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. చిన్నారుల పోషకాహారంపై అవగాహన కల్పించారు. పిల్లలకు ఆరోగ్య సమస్యలు వస్తే స్థాని క పీహెచ్‌సీ వద్దకు వెళ్లి చూపించాలన్నారు. సూపర్‌వైజర్లు వసుమతి, సంతోష, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

**నిజాంపేటలో..**

నిజాంపేట, మే 13 : నిజాంపేట మండలంలోని చల్మెడలో అంగన్‌వాడీ కేంద్రాన్ని జిల్లా మహిళ, శిశు సంక్షేమ అధికారి హైమావతి సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో బరువు తక్కువ ఉన్న పిల్లలను గుర్తించి బరువు పెరిగేలా చర్యలు తీసుకోవాలని వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. చిన్నారుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని అందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్ లక్ష్మీ నర్సమ్మ ఉన్నారు.

## కారు బైకు ఢీ.. ఇద్దరికి తీవ్రగాయాలు

కొడిపల్లి, మే13 : కారు బైకు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని తునికి గ్రామ శివారులో మంగళవారం చోటుచేసుకుంది. కొడిపల్లి ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాజిపేట గ్రామానికి చెందిన ఊరట్ల లక్ష్మణ్ (23), తొల్ల రమేశ్(21) ఇద్దరు కలిసి బైకుపై ఇంటి నుంచి నర్సాపూర్‌కు వెళ్తున్న క్రమంలో తునికి శివారు ప్రాంతానికి రాగానే నర్సాపూర్ నుంచి ఎదురుగా వస్తున్న కారు, బైకును ఢీకొట్టింది. గమనించిన స్థానికులు 108లో నర్సాపూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా అక్కడ పరీక్షించిన డాక్టర్లు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## నర్సులకు ఘన సన్మానం

### ఘనంగా అంతర్జాతీయ నర్సుల దినోత్సవం



దవాఖానలో నర్సును సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

రామాయంపేట, మే 13 : ప్రాణాలను కాపాడేది నర్సులేనని, వారిని ఎప్పుడూ చిన్నచూపు చూడకూడదని రామాయంపేట సీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ లింబాద్రి పేర్కొన్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా రామయంపేట ప్రభుత్వ దవాఖానలో మంగళవారం నర్సులను ఘనంగా సన్మానించి పుష్పగుచ్ఛాలను అందజేశారు. అనంతరం వైద్యులు లింబాద్రి మాట్లాడుతూ కరోనా సమయంలో మనుషుల ప్రాణాలను కాపాడింది నర్సులేనన్నది మరచిపోవద్దన్నారు. కరోనాతో ఉన్న పేషంట్లను ఎవరూ కూడా తాకలేరని కానీ నర్సులు దేవతలవలే వారికి సేవలు చేయడం గొప్ప విషయమన్నారు. డాక్టర్ సుకేశిని, నర్సులు జయలక్ష్మి, మంజుల, ఏసుమణి, లక్ష్మీబాయి ఉన్నారు.

## హోటళ్లు, బేకరీల్లో అధికారుల దాడులు



నిల్వ ఉంచిన ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకుంటున్న మున్సిపల్ సిబ్బంది

మెదక్ మున్సిపాలిటీ, మే 13 : మెదక్ పట్టణంలోని పలు హోటళ్లు, బేకరీలు, స్వీటహౌసుల్లో మంగళవారం మున్సిపల్ ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో ఆకస్మిక దాడులు నిర్వహించారు. నాణ్యత లేని ఆహార పదార్థాలను స్వాధీనం చేసుకొని నిర్వాహకులకు జరిమానాలు విధించారు. నిల్వ చేసిన, కుల్లిన ఆహార పదార్థాలు ఉంచరాదని, ఏ రోజు తినుబండరాలు ఆరోజే తయారు చేసి విక్రయించాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే మున్సిపల్ చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మున్సిపల్ పారిశుధ్య జవాన్లు, సిబ్బంది ఉన్నారు.

## కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలి




వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు

నర్సాపూర్, మే 13 : కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలు ఉపసంహరించుకోవాలని ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను మంగళవారం నర్సాపూర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ అనుసరిస్తున్న ఆర్థిక విధానాలకు రోజు గడవకడమే కష్టంగా మారిందన్నారు. నాయకులు హన్మంత్, ఖదీర్, శ్రీనివాస్, ప్రభాకర్, సుధాకర్, రవి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ

పెద్దశంకరంపేట, మే13 : వేసవి శిక్షణ శిబిరాల్లో భాగంగా పెద్దశంకరంపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం, తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈవో వెంకటేశం తెలిపారు. మంగళవారం విద్యార్థులకు చిత్రలేఖనంలో భాగంగా డ్రాయింగ్ ఇంగ్లిష్ లెటర్స్ ఏ విధంగా రాయాలో శిక్షణ ఇచ్చారు. ఆర్ట్ టీచర్లు వెంకట్, ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

## రైతులకు నష్టపరిహారం ఇప్పిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో మహిపాల్‌రెడ్డి

నర్సాపూర్,మే13 : సంగారెడ్డి రిచ్2 కెనాల్‌లో భూములు కోల్పోతున్న ప్రతి రైతుకు నష్టపరిహారం అందేలా చూస్తామని ఆర్డీవో మహిపాల్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం నర్సాపూర్‌లోని రైతువేదికలో నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సంగారెడ్డి రిచ్2 కెనాల్‌లో భూములు కోల్పోతున్న శివ్వంపేట్ మండలం తిమ్మాపూర్ గ్రామ రైతులతో సమావేశం నిర్వహించి, అభ్యంతరాలను స్వీకరించారు. శివంపేట్ నాయబ్ తహసీల్దార్ షఫీయొద్దీన్, గిర్దావర్ కిషన్, రైతులు పాల్గొన్నారు.

## అక్రమ మద్యం దందాపై అధికారుల దాడులు



మద్యం బాటిళ్లను చూపుతున్న ఎక్సైజ్ అధికారులు

శివ్వంపేట, మే 13 : శివ్వంపేట మండలంలోని శివ్వంపేట, గోమారం సికింద్లాపూర్, చండి గ్రామాల్లో మంగళవారం ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. ఈ సందర్భం గా గోమారంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఈ దాడులలో 1.8 లీటర్ల మద్యం, 2.6 లీటర్ల బీర్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ ఎస్సై అజీజ్ అహ్మద్, సిబ్బంది ప్రభాకర్, తదితరులు ఉన్నారు.

## సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

రామాయంపేట, మే 13 : విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి అయిత శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ఉదయం 8 నుంచి 11గంటల వరకు శిక్షణ ఉంటుందన్నారు. అనంతరం 11 గంటలకు విద్యార్థులకు స్నాక్స్ అందించి ఇంటికి పంపిస్తామని తెలిపారు. పీటీఐలు మల్లేశం, కవిత, యోగా గురువు భరత్, డ్రాయింగ్ టీచర్ యాదమ్మ తదితరులు ఉన్నారు.

## శ్రీసాయి నర్సింగ్ హోమ్ దవాఖాన తనిఖీ



దవాఖానలో రోగులతో మాట్లాడుతున్న వైద్య బృందం

నిజాంపేట, మే 13 : నిజాంపేటలోని శ్రీసాయి నర్సింగ్ హోమ్‌ను మాతా, శిశు ఆరోగ్య సంరక్షణ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సృజన, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ అనిలా మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దవాఖానలో అక్రమంగా అబార్షన్లు చేస్తున్నారని తమకు ఫిర్యాదు అందిందని, ఈ నేపథ్యంలోనే దవాఖానను క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు. తనిఖీల్లో డాక్టర్ హరిప్రియ, హెచ్ఈవో రామరావు, ఏఎన్ఎం బాలమణి పాల్గొన్నారు.

## పెద్దమ్మ ఆలయంలో చోరీ

రామాయంపేట, మే 13 : మండల పరిధిలోని రాయిలాపూర్ పెద్దమ్మ ఆలయంలో చోరీ జరిగింది. వివరాలలోకి వెళితే.. గ్రామ శివారులో ఉన్న పెద్దమ్మ ఆలయం తాళలు పగులగొట్టి అమ్మవారి వద్ద ఉన్న 15 గ్రాముల బంగారు నగలతో పాటు హుండీని పగులగొట్టి సుమారు రూ. 1.50లక్షల నగదును ఎత్తుకెళినట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ విషయం రామాయంపేట పోలీసులు విచారణ జరుపుతున్నారు.

## ఝాన్సీలింగాపూర్‌లో 'బడిబాట'

రామాయంపేట, మే 13 : మండల పరిధిలోని ఝాన్సీలింగాపూర్‌లోని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ముందస్తుగా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. మంగళవారం గ్రామంలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి వీధులను తిరుగుతూ బడిబయట ఉన్న పిల్లలు బడిలో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ బడిలో చేరితే అన్ని సౌకర్యాలు ఉంటాయని తెలిపారు.

## ప్రశాంతంగా 'పాలిసెట్'



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న సిబ్బంది

మెదక్ మున్సిపాలిటీ, మే 13 : మంగళవారం నిర్వహించిన పాలిసెట్ ప్రశాంతంగా జరిగింది. జిల్లా కేంద్రం మెదక్‌లో 6 పరీక్ష కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 1776 మంది విద్యార్థులకు 1705 మంది హాజరు కాగా, 71 మంది గైర్హాజరైనట్లు పాలిసెట్ కన్వీనర్ భవాని తెలిపారు.

## బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

కౌడిపల్లి, మే13 : బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని మహ్మద్‌నగర్ గ్రామ శివారులో మంగళవారం చోటు చేసుకుంది. కౌడిపల్లి ఎస్సై రంజిత్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. రాయిలాపూర్ గ్రామానికి చెందిన కుర్మ కిష్టయ్య (51) బైక్‌పై వెల్దుర్తి మండలం దర్పల్లి గ్రామానికి వెళ్లారు. మార్గమధ్యలో చెట్టును ఢీకొని మృతి చెందాడు. ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## వికసించిన 'మే' పుష్పం



వికసించిన మే పుష్పం

పెద్దశంకరంపేట,మే13 : మండల కేంద్రమైన పెద్దశంకరంపేటలోని ఉపాధ్యాయుడు లక్ష్మణ్ నివాసంలో మంగళవారం మే పుష్పం (ఫుట్బాల్ లిల్లీ పుష్పం) వికసించడంతో అందరినీ ఆకట్టుకున్నది. ప్రతి ఏడాది మే నెలలో ఈ పుష్పం వికసిస్తుందని వారు తెలిపారు. ఎరుపు, పసుపు పచ్చని వర్ణాలతో వికసించిన ఈ పుష్పాన్ని స్థానిక ప్రజలు తిలకిస్తున్నారు.